

# నిలకడలేని భక్తి

బాబాకి భక్తులు ఎందరో అలా ఎందరో భక్తులలో ఓ ముగ్గురు కుర్రాళ్ళు కూడా ఉన్నారు. వాళ్ళు ముగ్గురూ స్నేహితులు. కలిసి చదువుకుంటూంటారు. కలిసి కాలేజీకి వెళ్తాంటారు. ఏ పని చేసినా వాళ్ళు ముగ్గురూ కలిసే చేస్తుంటారు. వాళ్ళకి బాబా అంటే యిష్టం, ప్రేమ, భక్తి ఉన్నాయి. తరచు బాబా దర్శనానికి వస్తూ దర్శనం చేసుకుంటూ, దీవెనలు అందుకుని వెళ్తుంటారు. వాళ్ళ పేర్లు రాజేష్, సురేష్, నరేష్. అయితే ముగ్గురిలోకి నరేష్ బుద్ధిమంతుడు. భగవంతుడంటే నమ్మకం, విశ్వాసం పూర్తిగా వున్న నిశ్చయ, నిర్మల హృదయుడు. మిగతావారు అలా కాదు. బోళా భక్తిశ్రద్ధలు కలవాళ్ళు.

అయితే ఒకసారి హోరాహోరిగా బాబా సన్నిధిలో భజన జరుగుతోంది. అందరితో పాటు వీళ్ళూ కూర్చున్నారు భజనలో రాజేష్, సురేష్ మొక్కుబడిగా భజనచేస్తూ, దిక్కులు చూస్తూ, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. నరేష్ మాత్రం ఏకాగ్రతతో బాబా వైపే చూస్తూ, పాటలు పాడుతూ, తాళం వేస్తూ ఎంతో తన్మయత్వంతో ఊగిపోతున్నాడు. అయితే అతనికి ఉన్నట్టుండి బాబాకి బదులు ఆ స్థానంలో కృష్ణుడు, వేంకటేశ్వరస్వామి, రాముడు, ఆంజనేయుడు, దత్తాత్రేయుడు, శివుడు ఇలా దేవుళ్ళు కనిపించసాగారు. అతను ఆశ్చర్యంగా అంతమంది దేవుళ్ళని కళ్ళారా బాబాలో చూసి ఆనందాశ్చర్యభరితుడై అమాంతం వెళ్ళి బాబా పాదాలపై వ్రాలి తను చూసింది చెప్పాడు.

అది విని బాబా చిరునవ్వు నవ్వి- ''లే నాయనా! నీవు నిర్మలమైన, నిశ్చలమైన భక్తి భావంతో భజనలో కూర్చున్నావు. భగవంతునిపై నీకు పూర్తి భక్తివిశ్వాసాలు ఉన్నాయి. అందుకే ప్రతి ఒక్కరి పాటలో ప్రతి ఒక్క రూపాన్నీ చూడగలిగావు. నీవు ధన్యుడవు''

జి. రామలక్ష్మి, హైద్రాబాద్

అన్నారు.

మిగతావాళ్ళంతా అది విని ఎంతో ఆనందిం చారు. కానీ, సురేష్, రాజేష్ మాత్రం బాబాని నిందించారు.

''మీకు నరేష్ అంటే మొదటి నుంచీ యిష్టం, అభిమానం. అందుకే మీ అవతార రూపాలు వాడికొక్కడికి మాత్రమే చూపించారు. మేమంటే చిన్నచూపు. కాబట్టే మేం ముగ్గురం స్నేహితులమయినా మా ఇద్దరినీ వదిలేసి వాడికి మాత్రమే అవతార రూపాల్లో కనిపించారు'' అంటూ నిందలు వేసారు.

దానికి బాబా నొచ్చుకోకుండా, నవ్వుతూనే వారిని దగ్గరకు తీసుకుని- ''రండి. మీకో విషయం చూపిస్తా. ఆ తర్వాత మీరు వేసింది నిందా, నిజమా అన్నది మీరే తేల్చుకోండి'' అంటూ వారిని ఓ లోతులేని చెరువు దగ్గరకు తీసుకెళ్ళి ఒడ్డున కూర్చుండబెట్టి గులకరాళ్ళు నీళ్ళలో వేసారు. నీళ్ళు అలజడిగా, అలలుగా అటూ ఇటూ కదిలాయి. అప్పుడు బాబా ''మీకు ఈ నీళ్ళలో ఏం కనబడుతున్నాయి?'' అంటూ అడిగారు.

''అంతా కదలికగా, నిలకడలేకుండా ఉన్నాయి ఆ నీళ్ళు. అందువలన మాకేం కనపడటం లేదు'' అన్నారు వాళ్ళు.

''అలాగా! అయితే ఇప్పుడు బాగా చూసి చెప్పండి'' అన్నారు కాస్సేపాగి.

అవి కదలిక ఆగి నిశ్చలంగా ఉన్నాయి. అందువలన గులకరాళ్ళు చిన్న చిన్న చేపలు, అవీ కనిపించాయి వాళ్ళకి. బాబాకి చెప్పారు ఆ సంగతి.

బాబా నవ్వి, ''అందుకే మనసు కుదురుగా, నిర్మల, నిశ్చయ, నిండు భక్తిభావాలతో ఉంచు కుంటే భగవంతుడ్ని చూడవచ్చు. నీటిలా అలజడిగా వుంటే కంటికి ఏమీ కనిపించవుగా!'' అన్నారు.

దాంతో వాళ్ళ తప్పు వాళ్ళకి తెలిసి బాబా పాదాలపై వాలారు. అందుకే నిలకడలేని భక్తి ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే అని గ్రహించి, ఆనాటి నుంచీ వాళ్ళిద్దరూ మరింత భక్తి విశ్వాసాలతో బాబాని పూజించడం ప్రారంభించారు.

